సరుగుడు సాగుకు మొగ్గు

- వరి, చెరకుకు ప్రత్యామ్నాయంగా రైతుల అడుగులు
- ఈ ఏడాది 15 వేల ఎకరాల్లో సరుగుడు సాగు



పెరిగిన సరుగుడు తోట (ఇన్‌సెట్) నాటేందుకు సిద్ధంగా ఉంచిన సరుగుడు నారు

చోడవరం: ఈ ఏడాది సరుగుడు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గతంలో మెట్ట ప్రాంతాలకే పరిమితమైన సరుగుడు సాగు.. ఇప్పుడు నదీ పరివాహక ప్రాంతాల్లోను, పల్లపు ప్రాంతాల్లోనూ అధికంగా చేపడుతున్నారు. వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోవడంతో ఈ ఏడాది వరి, చెరకు సాగు తగ్గింది. వీటి స్థానంలో తక్కువ ఖర్చుతో సాగయ్యే సరుగుడు వేసేందుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీంతో సరుగుడు నారుకు విపరీతమైన గిరాకీ పెరిగింది. చోడవరం నియోజకవర్గంలో ప్రధాన పంటలు వరి, చెరకు. ఈ రెండు పంటలు సాధారణ విస్తీర్ణం ఏటా 21,500 ఎకరాల్లో వరి, 30 వేల ఎకరాల్లో చెరకు సాగు జరుగుతుంది. సరుగుడు సాగు 8 వేల ఎకరాల్లో జరిగేది. అయితే ఈ ఏడాది సరుగుడు సాగు ఏకంగా 15 వేల ఎకరాలకు పైబడి జరుగుతుందని అంచనా. సకాలంలో వర్షాలు పడకపోవడం, మరో పక్క వరి నారుమడులు ఎండిపోవడంతో ఆదిలోనే వరి సాగుకి నారు సమస్య ఉత్పన్నమైంది. వీటికి తోడు దమ్ములు, ఉడుపులకు యంత్రాలు, ట్రాక్టర్లు, కూలీలకు అయ్యే ఖర్చు నాట్లు సమయంలోనే ఎకరాకి రూ.10 వేల నుంచి 15వేలకు ఖర్చవుతుండటంతో పెట్టుబడి పెట్టలేని పరిస్థితిలో రైతులు ఉన్నారు.

చెరకుకు తెగుళ్ల బెడద

గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఈ ఏడాది క్రషింగ్ చేస్తాదో లేదో తెలియని పరిస్థితిలో ఉంది. చెరకు ఎకరా సాగుకు ఏటా సుమారు రూ. 40 వేలకు పైబడే ఖర్చవుతుండగా ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. దీంతో రైతులు ఏటా ఎంతో కొంత పంట నష్టపోతున్నారు. అంతేకాకుండా ఎకరాకు చెరకు కనీసం 15 నుంచి 20 టన్నులు కూడా దిగుబడి రాకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో పెద్దగా ఖర్చులేకుండా ఒక సారి ఉడిస్తే 4, 5 ఏళ్ల ఎటువంటి పెట్టుబడి లేకుండా ఒకే సారి మొత్తంలో డబ్బులు వచ్చే వాణిజ్య పంట అయిన సరుగుడుపై ఆసక్తి చూపుతున్నారు. అడపాదడపా పడుతున్న వర్షాలకు సరుగుడు నారు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఒక్కో మొక్క 80 పైసలు నుంచి రూపాయి ఉండగా.. ఇప్పుడు డిమాండ్‌ను బట్టి రూ.1.20లకు అమ్ముతున్నారు. నారు కోసం దూర ప్రాంతాలకు వెళ్లి మరీ తెచ్చి రైతులు సాగు చేస్తున్నారు. ఆహార పంటలైన వరి, చెరకు సాగు తగ్గడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

చెరకుకు గిట్టుబాటు ధర లేకే సరుగుడు సాగు

సరైన గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల చెరకు సాగు పూర్తిగా మానేశాం. తినడాకి తిండిగింజలు కోసం వరి సాగు చేస్తున్నాం. వర్షాలు కూడా ఎప్పుడు పడుతున్నాయో తెలియడం లేదు. ఇక్కడ అన్నీ వర్షాధారిత భూములు. పెట్టుబడులు కూడా చాలా ఎక్కువగా పెరిగిపోయాయి. చెరకు పంటకు చాలా ఖర్చవుతుంది. అందుకే ఉన్న రెండున్న ఎకరాల్లో ఈ ఏడాది ఎకరా భూమిలో మాత్రమే వరి వేశాను. ఎకరాన్నరలో సరుగుడు వేశాను.

– మేదా అప్పలకొండ, రైతు, జెడ్‌పట్నం

సరుగుడుకు పెట్టుబడి తక్కువ

పెట్టుబడి తక్కువ, ఏ తుఫాన్లు వచ్చినా పంట నష్టం పెద్దగా ఉండదు. అందుకే సరుగుడు వేశాను. ఈ ఏడాది గోవాడ ఫ్యాక్టరీ ఆడేలా లేదు. అందుకు చెరకు వేయలేదు. వరి ఎకరాలో వేశాను. మిగతా ఎకరాన్నరలో సరుగుడు వేశాను. గతంలో ఎప్పుడూ వేయలేదు. ఈ సారి పెట్టుబడి పెరిగిపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో చెరకుకు బదులు సరుగుడు వేశాను.

– శానాపతి రమణబాబు, రైతు, భీమవరం

క్లుప్తంగా

గొలుగొండలో వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రామారావు

గొలుగొండ: రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని గొలుగొండ ఎస్‌ఐ రామారావు హెచ్చరించారు. ఆయన గొలుగొండలో సోమవారం వాహన తనిఖీలు చేశారు. ఏజెన్సీ నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనదారుల వద్ద రికార్డులు లేకపోవడంతో కేసులు చేశారు. వాహనదారులు రికార్డులు లేకపోయినా, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్లిన ఆటోలపై జరిమానాలు విధించారు.

సబ్ పోస్టాఫీసుల్లో సర్వర్ మొరాయింపు

మాడుగుల రూరల్: సబ్ పోస్టాఫీసుల్లో సర్వర్ మొరాయించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమైన లెటర్లు రిజిస్టరు పోస్టు ద్వారా పంపించడానికి వీలు పడడం లేదు. రికరింగ్ డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వినియోగదారులు పోస్టాఫీసుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ సపోర్టు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు పోస్టల్ సిబ్బంది చెబుతున్నారు. కె.జె.పురం, మాడుగుల సబ్ పోస్టాఫీసుల్లో ఈ పరిస్థితి గత వారం రోజులుగా ఉంది. తక్షణం సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



కె.జె.పురం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కె.జె.పురంలో ఉమా భీమలింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని మహాకాళింశ్వర స్వామి ఆలయంతో పాటు జంపెన గుప్తలింగేశ్వర స్వామి, ఎం.కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు జరిపారు. కె.జె.పురం దబ్బకుంటు రహదారిలోని ఉమా పార్వతీపరమేశ్వర సమేత ఆలయంలో పూజలు నిర్వహించారు.

డీ-వార్మింగ్ డేను విజయవంతం చేయాలి

రోలుగుంట: జాతీయ డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రావణి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలో గల అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో డీవార్మింగ్ డే మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకునేలా చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రేపు మాడుగులలో విజయాంజనేయ విగ్రహ ప్రతిష్ట

మాడుగుల: స్థానిక గాంధీ పార్కు వద్ద బుధవారం విజయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠతో పాటు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు రాఖీ శ్రీను తెలిపారు. సీతారాముల భజన బృందం (తుని) సభ్యులతో భజన కార్యక్రమం, పరదేశమ్మ కోలాటం ప్రదర్శనతో పాటు భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే రూ.10 వేలు జరిమానా



దేవరాపల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

దేవరాపల్లి: మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే రూ.10 వేలు వరకు జరిమానా విధిస్తామని దేవరాపల్లి ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు దేవరాపల్లి శివారు శివాలయం సమీపంలో సిబ్బందితో కలిసి సోమవారం ఆయన వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారుల లైసెన్స్, ఆర్సీ బుక్, ఇన్సూరెన్స్ తదితర రికార్డులను పరిశీలించారు. త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగంగా వాహనాలు నడిపితే కొత్త నిబంధన ప్రకారం భారీ జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

ఆపరేషన్ థియేటరా? డైనింగ్ హాలా?

రేగుపాలెం పీహెచ్‌సీ ఓటీలో సిబ్బంది భోజనాలు



పీహెచ్‌సీ ఆపరేషన్ థియేటర్‌లో సోమవారం మధ్యాహ్నం భోజనాలు చేస్తున్న సిబ్బంది



శస్త్ర చికిత్సలు చేసే టేబుల్‌పై ఉంచిన ఆహార పదార్థాలు

యలమంచిలి రూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం, తెలిసినా ఏం చేస్తారులే అన్న ధీమా వెరసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. యలమంచిలి మండలం రేగుపాలెం పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసే ఆపరేషన్ థియేటర్‌ను అక్కడ సిబ్బంది ఏకంగా డైనింగ్ హాల్‌గా మార్చేశారు. రోజూ ఈ ఆస్పత్రి ఓటీలో సిబ్బంది దర్జాగా మధ్యాహ్న భోజనాలు చేయడానికి వినియోగిస్తున్నారు. ఓటీలో ఏసీ వేసుకుని కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేస్తున్నా ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు చేసే గదుల నిర్వహణ ప్రత్యేకంగా ఉంటుంది. క్రిమిరహితంగా ఉండేలా రోజూ ప్రత్యేకమైన పద్ధతుల్లో ఓటీని శుభ్రపరచాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ సిబ్బంది భోజనాలు చేయడానికి వినియోగిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వాస్పత్రుల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు ఉన్న శస్త్రచికిత్సలు చేసే గదులు వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో సాధారణ గదుల్లా మారుతున్నాయి. గతంలో ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేయించుకున్న వారిలో ఇద్దరికి ఇన్‌ఫెక్షన్ సోకిన సందర్భాలున్నాయి. అయినప్పటికీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిలో మార్పు రాకపోవడానికి ఉన్నతాధికారుల ఉదాసీనతే కారణంగా తెలుస్తోంది. ఈ విషయంపై రేగుపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు సుగుణను సంప్రదించగా గదులు చాలకపోవడం వల్ల ఓటీలో భోజనాలు చేస్తున్నారన్నారు. రోజూ భోజనాలు చేసిన తర్వాత ఓటీని శుభ్రపరుస్తున్నారన్నారు. రేగుపాలెం పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్‌ను డైనింగ్ హాల్‌గా మార్చిన వైనంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

ఆలయ భూముల కౌలు వేలం రేపు

కశింకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ భూములకు సంబంధించి మూడేళ్ల కాల పరిమితితో కౌలుకు ఇవ్వడానికి ఈ నెల 13న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు. పలు గ్రామాల్లో 40.68 ఎకరాల పంట భూములకు సంబంధించి ప్రథమ ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొవాలన్నారు. ఎక్కువ మొత్తానికి పాట పాడుకున్న వారు ఏడాదికి కౌలు సొమ్ము డిపాజిట్‌గా సత్వరమే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఆర్టీఐ యాక్టుపై అవగాహన

అనకాపల్లి: జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి లచ్చన్న తెలిపారు. మండలంలో తుమ్మపాలలో రైతు సాధిక సంస్థ కార్యాలయంలో సోమవారం ఆర్టీఐ యాక్టుపై రైతులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడానికి యువత ముందుకు రావాలని కోరారు. ఎటువంటి రసాయనాలు లేని పంటలు పండించడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులు రోజూ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మార్కెటింగ్ చేస్తున్నామన్నారు.

సమస్యలపై డిగ్రీ కాలేజీ సిబ్బంది నిరసన

చోడవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బోధన, బోధనేతల సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం విధులకు హాజరై నిరసన తెలిపారు. చోడవరం డిగ్రీ కాలేజీ అధ్యాపకుల సాధారణ బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని, ప్రస్తుతం ఉన్న అధ్యాపకుల స్థాయిని సహాయ ఆచార్యులుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 42ను రద్దు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

సంస్కృత భాష ప్రాధాన్యంపై ర్యాలీ

కశింకోట: కన్నూరుపాలెంలో సంస్కృత శిక్షణ బాల కేంద్రం ఆధ్వర్యంలో సంస్కృత భాష ప్రాధాన్యంపై సోమవారం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు సంస్కృత సప్తాహాల్ భాగంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో భగవద్గీత, సంస్కృత భాష పరిచయం, అభ్యాసం, అభినయ గీతాలు, శ్లోకాలు పఠనం, కథలు చెప్పడం వంటివి నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృత భారతి ప్రాంత సంపర్క ప్రముఖ్ రామకుమార్ విశిష్ట అతిథిగా మాట్లాడుతూ కన్నూరుపాలెం సంస్కృత గ్రామంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. బాల బాలికలకు గీత హైస్కూలు కరస్పాండెంట్ అన్నారావు జ్ఞాపికలను అందజేశారు.

వరాహనదికి జలకళ

కోటవురట్ల: వరాహకు మళ్లీ జలకళ చేరింది. ఎగువ ఏజెన్సీ ప్రాంతంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరాహనదిలోకి వరదనీరు చేరుతోంది. పాతరోడ్డు సమీపంలో రెండు నదులు కలియడంతో ఇక్కడ నీటి ప్రవాహం పెరుగుతోంది. పందూరు ప్రాంతంలోని వరాహనదిలో వరదనీటి ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉంది. వరాహనదిలోకి జలకళ రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జల్లూరు శివారున వరాహనదిలోకి చేరుతున్న వరదనీరు

ఎండీఎం కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



పాఠశాలలో ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పరవాడ: మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని మండల ఎండీఎం కార్మిక సంఘం అధ్యక్షులు కె.ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు వాడ చీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో ఐద్వా ఆధ్వర్యంలో ఎండీఎం కార్మికు లు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో 18 ఏళ్లగా 8 మంది కార్మికులు వంట పని చేస్తున్నప్పటికీ వారిలో నలుగురికి మాత్రమే నెలకు రూ.3 వేలు చొప్పున వేతనం అందిస్తున్నారని పేర్కొన్నా రు. ఆ నలుగురికి వచ్చిన వేతనాన్ని 8 మంది పంచుకుంటున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితి జిల్లాలో అనేక పాఠశాలల్లో జరుగుతోందన్నారు. బయట కూలి పనులకు వెళితే ఒక్కొక్కరికి రోజుకి రూ.600 చెల్లిస్తున్నారని, పాఠశాలల్లో వంట పని వారి ఇబ్బందులను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు బియ్యం, గుడ్లను మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తుందని, మిగిలిన వంట సామగ్రి కొనుగోలుకు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించే వరకు చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనంతో పాటు యూనిఫారం, ఐడెంటిటీ కార్డు, ఆస్పత్రి సదుపాయం కల్పించాలని ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, జి.లక్ష్మి, కె.రత్నకుమారి, పి.నాగమణి, గాజుల సత్యవతి, కె.పైడితల్లి, ఎ.నూకరత్నం, లక్ష్మి పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదు



గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



బోడికొండ దిగువన ఐదెకరాల విస్తీర్ణంలో జెడ్పీ ఉన్నత పాఠశాల

అచ్యుతాపురం రూరల్: మడుతూరులో బోడికొండ సర్వే నంబర్ 285లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై గ్రామస్తులు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం తెల్లవారు నుంచి అనధికారంగా ఏర్పాటు చేసిన మూడు క్వారీ లారీలు, ఒక జేసీబీతో గ్రావెల్ తవ్వకాలు చేపట్టగా అడ్డుకున్నారు. గతంలోనూ ఇదేవిధంగా చేపట్టిన తవ్వకాలపై చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని వాపోయారు. కూటమి నాయకులు అండదండలతో అక్రమంగా గ్రావెల్ తరలించుకుపోతున్నారని ఆరోపించారు. ఇక్కడ కొండను ఆనుకుని ఐదెకరాల విస్తీర్ణంలో జెడ్పీహైస్కూలు ఉందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పాఠశాలతోపాటు దిగువ ప్రాంతాల్లో గ్రామాలకు ముప్పు పొంచే అవకాశం ఉందని వాపోయారు.

బల్క్‌డ్రగ్ పార్క్‌కు భూములిచ్చేది లేదు

కలెక్టర్, ఆర్డీవోలకు రైతుల వినతి



బల్క్ డ్రగ్‌కు భూములిచ్చేది లేదంటూ ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట సమీపంలో ఏపీఐఐసీ వారు ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పరిశ్రమలకు భూములిచ్చేది లేదని సీహెచ్ఎల్‌పురం, జానకయ్యపేట, పెదతీనార్ల గ్రామాల రైతులు స్పష్టం చేశారు. సోమవారం వీరంతా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సీపీఎం నాయకుడు ఎం అప్పలరాజుల ఆధ్వర్యంలో కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లను వేర్వేరుగా కలసి వినతి పత్రాలు అందజేశారు. బల్క్‌డ్రగ్ పార్క్ ఫేజ్ 2 కోసం అదనంగా 700 ఎకరాలు భూములు సేకరించేందుకు ప్రభుత్వం 6ఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 6న ప్రజాభిప్రాయ సేకరణలో మత్స్యకారులు నిరసన తెలిపారు. నర్సింహమూర్తి, అప్పలరాజు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలంతా భూములనే నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పరిశ్రమల ఏర్పాటును వ్యతిరేకించిన రైతుల అభిప్రాయాలు, ఆందోళనల వీడియో క్లిప్పింగ్‌లు తారుమారు చేయకుండా యధావిధిగా కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. నూటికి 95 శాతం మంది వ్యతిరేకించారన్నారు. ప్రాణాలిచ్చయినా భూములను కాపాడుకుంటామని, ప్రభుత్వం విడుదల చేసిన 6ఏ నోటీసులు ఉపసంహరించుకోవాలని కోరారు. పచ్చటి పొలాలను ప్రమాదకర రసాయన పరిశ్రమల కోసం తీసుకుని ఈ ప్రాంతాలను కలుషితం చేయొద్దని కోరారు.

భారీ వర్షం.. వరినారుకు ఊపిరి



బుచ్చెయ్యపేట పొలాల్లో కమ్ముకున్న కారు మబ్బులు



పెద్దేరు జలాశయం నుంచి వరద నీరు దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

మాడుగుల: మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర సేపు కుండపోతగా వర్షం పడింది. దీంతో ఎండిపోయిన వరి నారుమడులు ఊపిరి పోసుకున్నాయి. పెద్దేరు జలాశయంలోకి 300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అంతే వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో 15 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా.. ప్రస్తుతం 135.90 మీటర్లు ఉంది. ప్రస్తుతం జలాశయం ప్రధాన రెండు పంట కాలువల ద్వారా 120 క్యూసెక్కులు సాగునీరు విడుదల చేయడంతో పెద్దేరు ఆయకట్టు 5 వేల ఎకరాలలో ముమ్మరంగా వరి నాట్లు వేసుకుంటున్నారు. పెద్దేరు ఏటి బాధిత గ్రామాలైన జేడీపేట, గవర వరం, సత్యవరం, డి.గొటివాడ, వీరనారాయణం, వీరవల్లి గ్రామాల రైతులు, పశువుల కాపర్లు పెద్దేరు నదిలో దిగరాదని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. పెద్దేరుకు వరద ముంపు కారణంగా జలాశయం గేట్ల ద్వారా వరద నీరు విడుదల చేయవచ్చునని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలిపారు.

రోలుగుంట: మండలంలో పలు గ్రామాల్లో కురిసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నీటి ఇంజన్ల ద్వారా తడుపుకున్న భూముల్లో సోమవారం వర్షం తోడు కావడంతో భోగాపురం, కొమరవలో, కొవ్వూరు దగ్గర ఉన్న వరకట్ట భూముల్లో దమ్ములు పనులు చేపట్టారు. మండలంలో రోలుగుంటతో పాటు, కొండపాలెం, వెలంకాయలపాలెం, కొవ్వూరు తదితర గ్రామాల్లో వర్షం పడింది.

మాకవరపాలెం: మండలంలో వరి నారుమడులు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో నారుమడులను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అయితే సోమవారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపాడు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. దీంతో నారుమడులకు ఈ వర్షం ఎంతో మేలు చేసిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బుచ్చెయ్యపేట: మండలంలో భారీ వర్షం కురిసింది. పది రోజులుగా వేసవిని తలపిస్తున్న రీతిలో ఎండలు మండిపోతుండగా తాజా కురిసిన వర్షంతో ప్రజలు ఊరట చెందారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర ఎండ కాసింది. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుని గాలిలో కూడి వర్షం పడింది. ఎండిపోతున్న వరి ఆకుమడులకు, నాటిన వరినాట్లుకు ఈ వర్షం మేలు చేసింది.



బుచ్చెయ్యపేటలో వరి పొలాల్లో చేరిన వర్షం నీరు



రోలుగుంటలో కురుస్తున్న వర్షం

16న శ్రీకృష్ణాష్టమి వేడుక



గణపతి లక్ష్మీసమేత శ్రీకృష్ణ మందిరం

అనకాపల్లి: మండలంలోని మారేడుపూడి గ్రామంలో బీసీ కాలనీలో గణపతి లక్ష్మీసమేత శ్రీకృష్ణ స్వామి ఆలయంలో ఈ నెల 16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు ఈగల కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేరోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం 4 గంటలకు ఉట్టి కొట్టుట, రాత్రి 7 గంటలకు క్లాసికల్ కూచిపూడి డ్యాన్స్ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.